# శ్రీసన్నిధానం

సహస్రాబ్ది ప్రత్యేక సంచిక

ఫిబ్రవరి 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3 చారిత్రాత్మక ఘట్టం - పాల్గొనుటే మహాభాగ్యం!

4 “వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ”

5 మోడీ వచ్చిన వేళ...!!

5 సనాతనన ధర్మానికి పూర్వ వైభవం

7 వైకుంఠాన్ని తలపించే మనోన్నత వేదిక

9 చిన్నజీయరు స్వామి ప్రవచనామృతం

11 సహస్రాబ్దికి తరలివచ్చిన ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు



సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

గౌరవ సంపాదకులు

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

జగమంత “జయహెూ” అనే జగదా చార్యుల ప్రతిష్ఠా మహెూత్సవం! పరిపూర్ణమైన సమతా మూర్తి స్ఫూర్తి వైభవం. మహా పూర్ణాహుతితో సంపూర్ణ తేజోమయమైన సువర్ణమూర్తి స్వరూపం! సఫలీకృతమైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి సంకల్ప సాకారం. సదా అస్మదాచార్య సన్నిధి వీడక వెనువెంటే సంచరించే ఆచార్య ద్వయం సహకారం. లోకహిత కాంక్షులై భక్త జన పరివేష్టితులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి మంగళా శాసనం! అరుదైన హవనాలు, అపురూప దృశ్యాలు. కరిగిన కాలంతో పాటు చెరగని స్మృతులు. మన శ్రీసన్నిధానంలో మూర్తిభవించిన ముఖచిత్ర విశేషాలు. శ్రీరామానుజ సమతామూర్తి ఆవిష్కరణకు తరలిరండంటూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆదేశాలను శ్రీవైష్ణవ సమాజం భక్తజన బృందం తుచ తప్పక పాటించింది. అమ్మో లక్షదాది జనం తరలి వస్తే ఏర్పాట్లు ఎలా ఉంటాయో అనే భయం లేకుండా శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి అభయ హస్తం ఇచ్చారు. వారికి మాట రాకుండా ఏర్పాట్లు చూసుకుంటాం అంటూ శ్రీశ్రీశ్రీ అహెూబల రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వాములు అనుక్షణం ప్రయత్నించారు.


PUBLISHED BY :

డింగరి శ్రీనివాసమూర్తి

మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9 502583323;

## సంపాదకీయం

# చారిత్రాత్మక ఘట్టం - పాల్గొనుటే మహాభాగ్యం!

శ్రీవైకుంఠాన్ని చూడగలమో లేదో కానీ అలాంటి దివ్య అనుభూతిని మన అపర రామానుజాచార్యులు కల్గించారు. సమతామూర్తి సన్నిధిలో 108 దివ్యదేశాలు కొలువైన వేళ.. చతుర్దశ భువనాల్లా నలువైపులా నాలుగు వేదికలు. ఎక్కడ చూసినా జీయరు స్వాములే. నాలుగు ప్రదేశాలలో భక్తిభావం వెల్లివిరిసే కార్యక్రమాలు నృత్యాలు, కోలాటాలు, కీర్తనలు, మేళతాళాలు, తుంబురనాదాలు, వేదఘోషలు, పెద్దల ప్రవచనాలు, 'జీయరో జియరు మన చినజీయరు' అంటూ జానపదుల పాటలు... ఇల వైకుంఠమిది అనిపించేలా తలపించేలా భక్తిభావం వెల్లివిరిసింది. చాలు చాలు ఈ జన్మకిదిచాలు అనే భావన భావోద్వేగం సందర్శకులకు కలిగేలా ఒళ్లు పులకరించింది. దివ్యసూరులు కదిలినట్లుగా పన్నిద్దరు జీయరు స్వాములు. ఎక్కడ చూసినావారే. యాగశాలలో వారే, ప్రవచన మంటపంలో వారే. దివ్యసాకేతంలో, సమతామూర్తిసన్నిధిలో కూడా వారే! అయితే మనజీయరు చినజీయరు ఎక్కడున్నాడో అంటూ వెదికే కన్నులు. అడుగడుగునా ఆర్ధత, ఆచార్య నిష్ఠ. మాట వినపడుతుంది కానీ వారు కనిపించరే అని చినజీయరు కోసం వెదుక్కునే వారే ఎక్కువ.



ఒక సందర్భంలో పన్నిద్దరు జీయరు స్వాములు యాగశాల ప్రదక్షిణ చేస్తున్న వేళ... జై శ్రీమన్నారాయణ!, జయహో రామానుజా!! అనే నినాదాలు మిన్నంటాయి. దివ్యసూరులు... మనను కరుణించి మంగళాశాసనాలు అనుగ్రహించడానికి భువికి తరలివచ్చారా? అన్న భావన! నాలుగు అడుగులు వారి వెంటనడిస్తే జన్మ చరితార్థమైపోతుందన్న స్పందన. ప్రతినిత్యం ఇసుకవేస్తే రాలనంత భక్తజన సందోహం. చతుర్విధ భువనాల మాదిరిగా నాలుగు ప్రదేశాలో ఎక్కడ ఏం జరుగుతుందో అన్న ఆరాటం ఆత్రుత. ఒకే చోట ఉంటే మరో అద్భుతం చూడలేమన్న ఆరాటం.

వెయ్యేళ్ల పండుగ వేడుక అంగరంగ వైభోగంగా చూడముచ్చటగా కనుల విందుగా జరిగింది. ఈ దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించడానికి మాటలు రావు, భావాలు వెదుక్కోవాల్సినదే. ఒకవైపు హోమాలు, మరోవైపు రాజకీయనాయకుల రాకపోకలు, ప్రముఖుల తాకిడి. సినీప్రముఖులు అందరినోట ఒకే మాట! అద్భుతం మహాద్భుతం ఇది ఒక చిన్నజీయరుకే సాధ్యం అయింది. ఎన్నో సంగతులు మరెన్నో విశేషాలు, హోమశాలలు, ఇష్టిశాలలు, సమతామూర్తి నీడలో సభావేదికలో అందరి హృదాయాల స్పందన అనిర్వచనీయం. ప్రవచన మంటపంలో కానీ, సమతామూర్తి వద్ద కానీ వూరేగింపులోకానీ ఎక్కడైనా చిన్న జీయర్ కనుచూపుతో భక్తులలో కార్యకర్తలలో క్రమశిక్షణ వెల్లివిరిసింది. ప్రపంచం నలు మూలల నుండి ఈ పండుగలో పాల్గొనడానికి వచ్చిన వారిని చూస్తే ముచ్చటేస్తుంది. ఆచార్యుల పై ప్రేమ, ఆచార్యనిష్ఠ అడుగడుగునా కనిపిస్తుంది. లక్షలాది జనం తరలివచ్చినా, ఆ హడావిడి కనిపించలేదు. అంతటా ప్రశాంతత, అడుగడుగునా పరిశుభ్రమైన వాతావరణం. మేము సైతం అంటూ ప్రతిఒక్కరూ సైనికుల్లా నడుచుకున్నారు. శ్రద్ధ, భక్తి అడుగడుగునా కనిపించింది. అష్టాక్షరీ జపంలో పాల్గొనడానికి ఉదయం వేళ నగరం నుంచి ముచ్చింతలకు పయనమైన వాహనాలను గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తిలకధారణతో ఆచార్యుల చెంతచేరినవారిలో చెక్కుచెదరని ప్రశాంతత. అష్టాక్షరీ జప సమయంలో సూదిపడితే వినపడేంత నిశబ్దం. ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసిన వేళ... ఆచార్య సన్నిధిలో ఆధ్యాత్మిక ఆనందం వెదుక్కుంటూ నగరం నుంచి ఉరుకులు పరుగుల్లా ప్రయాణం. కార్యాలయాలకు వెళ్లేవారు పనులను చక్కబెట్టుకునేవారు అందరూ నిత్యం నగరానికి వెళ్లి తిరిగి పూర్ణాహుతి సమయానికి వచ్చేవారు.

ఉన్నతహోదాలలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, రాజకీయనాయకులు ఇలా చెప్పుకుంటూ వెళితే నగరం నుండి పలువురు ఆధ్యాత్మిక సౌరభాన్ని ఆస్వాదించడానికి ప్రతినిత్యం ముచ్చింతలకు పరుగు పెట్టేవారే కనిపిస్తారు. సమతామూర్తిని సందర్శించి లేజర్ షో వీక్షించిన వారూ ఉన్నారు. ఇది ఇలా ఉంటే నగరంలోని శ్రీవైష్ణవకుటుంబాలవారు, వివిధ ప్రాంతల నుంచి యాగంలో ఋత్విక్‌లుగా పాల్గొనడానికి వచ్చినవారు సైతం ఆచార్యుల ఆజ్ఞమేరకు సకుటుంబ సపరివారంగా తరలివచ్చారు. నిత్యం వేడుకలు తిలకిస్తూ దివ్యానుభూతికిలోనయ్యారు. చివరగా నాలుగు రోజుల తరువాత నిర్వహించిన కళ్యాణోత్సవానికి సైతం తరలివచ్చిన వారి సంఖ్య ఏమాత్రం తగ్గలేదు. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం ఇందులో పాల్గొనుటే మహాభాగ్యం. ఈ సమయంలో ఇక్కడ ఉండటమే తమ కర్తవ్యమని భావించి ఉత్సవం ముగిసేవరకు ఉన్నవారందరూ తిరిగి వెళతూ ఇలాంటి అనుభూతి మళ్లీ పొందగలమో! ఈ వైభోగం ఈజీవితంలో చూడగలమో లేదో అని 'న భూతో న భవిష్యతి' అని పరవశిస్తుంటే... భవిష్యత్‌లో ఈ వైభవం చూడగలరు అంటూ శ్రీశ్రీశ్రీ చినజీయర్ వారి నోట భవిష్యత్ వాణి పలికింది.

# “వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ”

“వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ. వెయ్యి కాంతుల ఉపదేశ సుధలు కురిసేను దండిగా” సహస్రాబ్ది స్ఫూర్తి శ్రీవైష్ణవ దీప్తి నలుదిశలా విస్తరించిన పర్వదినాలు ఇవి. “హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం” అని కీర్తించే శ్రీ మహాలక్ష్మి స్వరూపం సువర్ణం. బంగారం అంటే శ్రేష్టమైనది,విలువైనది కరుణా మూర్తి అయిన జగన్మాత స్వరూపం, అటువంటి సువర్ణ మూర్తిగా జగదాచార్యులు అవతరించారు. కారుణ్యం మూర్తిభవించిన జగదాచార్యుల సువర్ణ స్వరూపం ఆవిష్కరింపబడింది. విభు స్వరూపం అంటే జగత్ ప్రభువైన శ్రియః పతి రూపమే ఆ విధంగా మానవ సాధ్యమైన విరాణ్ మూర్తిగా సమతా మూర్తి ఆవిష్కరింపబడింది. జగదాచార్యుల విగ్రహమూర్తులలో గొప్ప మహత్వం ఉన్నది. ఆచార్యులు అవతరించక ముందే” కలౌ కశ్చిత్ భవిష్యతి” అని భగవచ్ఛాస్త్రంలో చెప్పబడిందట! పూర్వాచార్యులు ఆళ్వార్లు అయిన శ్రీ నమ్మాళ్వార్ చేత శ్రీ రామానుజాచార్యుల భవిష్యత్ ఆచార్య విగ్రహమూర్తి శిష్యులకు ప్రసాదించ బడింది. శ్రీ రామానుజాచార్యులు శ్రీపెరంబూదూర్‌లో తానే శిష్యులపై ప్రీతితో అర్చామూర్తిని ప్రతిష్టించారు ఆమూర్తిని “తానుహంద తిరుమేని” అని కీర్తిస్తారు. తిరునారాయణ పురం లో తన విశ్లేషణ సహించలేని శిష్యుల కోసం “తమరుహంద తిరుమేని” అని కీర్తించబడు అర్చా విగ్రహాన్ని స్వయంగా జగదాచార్యులే ఏర్పాటు చేశారు. మరొక అద్భుతాశ్చర్యాలలో ముంచే దివ్య తిరుమూర్తి శ్రీరంగం లో ఉంది. “శరణాగతి” ప్రపత్తి చేసిన శ్రీ రామానుజాచార్యులను “శ్రీరంగే సుఖ మాస్వ” అని శ్రీరంగనాథుడు ఆజ్ఞాపించగా అక్కడే తన దివ్య నిజ తిరుమేనితో వెలిశారు. ఆ మూర్తి “తానాన తిరుమేని” గా కీర్తించబడుతున్నది. ఈ విధంగా జగదాచార్యుల విగ్రహ మూర్తులు గొప్ప మహత్తును కలిగి ఉంటాయి.

ఆ విధంగానే శ్రీ శ్రీనివాస స్వరూపులైన శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారి సంకల్ప స్వరూప మూర్తిగా దివ్యసాకేత ప్రదేశంలో జగదాచార్యులు ప్రతిష్ఠించబడ్డారు. జగదాచార్యులు సహస్రఫణి భూషితులైన ఆదిశేషులు కనుకనే పంచ త్రింశతి సహస్ర కుండాత్మక (1035 కుండాలతో) హవనారాధనలతో ప్రతిష్ఠాత్మకంగా విరాట్, సువర్ణ మూర్తులుగా సమతామూర్తి ప్రతిష్ఠించబడ్డారు. ఈ స్ఫూర్తి నుండే శ్రీ రామానుజాచార్యుల చరిత్ర వైభవం, వారి శ్రీసూక్తి సుధామాధురి ప్రతి ఒక్కరినీ ఉజ్జీవింపచేస్తుంది.




“సమాజహితం సమతా అభ్యుదయం జగదా చార్యుల పథం అదే జన జీవన సుపథం!” వారి దివ్య జీవన మార్గం నాలుగు దివ్య దేశాల పుణ్యక్షేత్రాల స్ఫూర్తితో సాగినట్లుగా చరిత్ర వైభవం తెలుపుతుంది. అవి:- శ్రీకంచి, శ్రీరంగం, తిరుమల, తిరు నారాయణపురం. వారి జీవిత కథ ననుసరించి ఆయా పెరుమాళ్ళతో పిత్రు, ఆచార్య, శిష్య, పుత్ర సంబంధం కలిగి ఉన్నట్లుగా పెద్దలు సమన్వయిస్తారు.

శ్రీపెరంబుదూర్ లో అవతరించిన శ్రీ భగవద్ రామానుజాచార్యులు శ్రీకంచికి చేరుకొని అనేక అనుభవాలతో అక్కడి పెరుమాళ్ళ ఆజ్ఞతో శ్రీ సిద్ధాంత వర్తనులై సన్యసించారు.

పూర్వాచార్యుల ఆజ్ఞతో శ్రీ రంగనాథ ఆహ్వానంతో దేవ పెరుమాళ్ళ సన్నిధి శ్రీకంచి వదిలి శ్రీరంగానికి విచ్చేశారు ఆ విధంగా శ్రీకంచి త్యాగ మంటపంగా కీర్తించబడింది.

శ్రీరంగ పెరుమాళ్ల ఆజ్ఞతో అక్కడే నివాసం చేశారు పంచాచార్యుల చేత ఉపదేశం పొందారు. ఎందరినో ఉద్ధరించి శిష్యులుగా చేర్చుకున్నారు. ఎన్నో దివ్య దేశాలను సంస్కరించారు. ఉభయ వేదాంత సారమైన శ్రీ సిద్ధాంతాన్ని ప్రవర్తింప చేశారు. ఈ విధంగా శ్రీరంగం భోగ మండపం గా కీర్తించబడింది.

శ్రీ తిరుమల నంబి గారి వద్ద **(మిగతా 12 పేజీలో)**



" గురువు ద్వారానే ధ్యానం సిద్ధిస్తుంది. ధ్యానంతో జ్ఞానం సిద్ధిస్తుంది. జ్ఞానం చేత దేనినైనా సాకారం చేసే శక్తి లభిస్తుంది. ఇదే భారతీయ సంస్కృతి "

-నరేంద్రమోడి

## మోడీ వచ్చిన వేళ...!!

ప్రతిష్ఠాత్మకంగా జరిగిన శ్రీ రామానుజ సహస్రాబ్ది సమారోహ కార్యక్రమానికి మాననీయ ప్రధానమంత్రి శ్రీమాన్ నరేంద్ర మోడీ గారు విచ్చేశారు. శ్రీ రామానుజ సమతా మూర్తి ఆవిష్కరణ తో పాటు వైదిక ఆరాధనల్లో కూడా పాల్గొన్నారు. తేజోవంతమైన శ్రీ వైష్ణవ కట్టుబొట్టు వేషధారణతో సంస్కృతిని గౌరవిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. నిర్దేశిత కార్యక్రమ ప్రణాళిక ననుసరించి వారు సమతామూర్తి ఆవరణను, 108 దివ్య దేశాల దేవాలయాలను సమగ్రంగా సందర్శించారు యాగశాలల ఆవరణకు విచ్చేసి, దేశ క్షేమం కోరి చేసే విశ్వక్సేన ఇష్టిలో పాల్గొన్నారు. పూర్ణాహుతిని సంకల్ప సహితంగా సేవించుకున్నారు. ప్రవచన మంటపంలో ప్రముఖులతో, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి తో కలిసి వేంచేశారు. అద్భుత గంభీర ప్రసంగాన్ని కొనసాగించారు " మా సరస్వతీ దేవి ఆరాధన దినమైన వసంత పంచమి శుభ దిన శుభాకాంక్షలు తెలిపారు." ధ్యాన మూలం గురుమూర్తి" గురు స్వరూప ధ్యానమే చేయ తగినది. గురువు ద్వారానే ధ్యానం సిద్ధిస్తుంది. ధ్యానంతో జ్ఞానం సిద్ధిస్తుంది. జ్ఞానం చేత దేనినైనా సాకారం చేసే శక్తి లభిస్తుంది. ఇదే భారతీయ సంస్కృతి" అని గురువు ప్రాధాన్యాన్ని తెలిపారు. అటువంటి జగద్గురువు లైన శ్రీ రామానుజాచార్యుల మూర్తి అందరికీ గొప్ప ప్రేరణ కలిగిస్తుంది. భారతీయ ప్రాచీన సంస్కృతిని దృఢపరుస్తుంది. అని తెలిపారు. శ్రీ రామానుజాచార్యుల జీవిత చరిత్ర లోని పలు అంశాలను ప్రస్తావించారు 108 దివ్య దేశాలు గురించి, ఆళ్వారుల గురించి ప్రస్తావించారు. శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామివారి అనుగ్రహంతో తాను పాల్గొన్న "విశ్వక్సేన ఇష్టి" వలన దేశ క్షేమం అనే సంకల్పం నెరవేరుతుంది అన్నారు. శ్రీ రామానుజ సిద్ధాంతాన్ని కొనియాడారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారిని ప్రశంసించారు. దేశం మొత్తం భాగ్యనగర విశేష సమాచారాన్ని గ్రహించేలాగా దేశ, విదేశాలను ఆకర్షించేలాగా వారి ప్రసంగం కొనసాగింది.

## సనాతనన ధర్మానికి పూర్వ వైభవం

రామానుజ సహస్రాబ్ది సమారోహానికి మాన నీయ దేశ రక్షణ శాఖ మంత్రి అమిత్ షా గారు విచ్చేశారు .సందర్శనానంతరం సమావేశంలో వారు ఆసక్తికర విషయాలతో ప్రసంగం కొనసాగించారు . సనాతనన ధర్మానికి మళ్ళీ వైభవం రాబోతుందని అన్నారు . ముందుగా వినమ్రంగా ఆచార్యులకు సంతులకూ వారి శ్రీ చరణాలకు నమస్కరిస్తూ ప్రసంగం కొనసాగించారు.భారత దేశచరిత్రలో రామాయణ కాలం నుండి కూడా సనాతన ధర్మానికి ఎప్పుడు సంకటం వాటిల్లినా. దాన్ని తొలగించి ధర్మాన్ని ప్రజ్వరిల్ల చేసే ఆచార్యులు మహాపురుషులు అవతరిస్తారు



శ్రీ రామానుజాచార్యులు అట్లే అవతరించారు అని తెల్పారు.శంకరాచార్యుల తర్వాత అవతరించిన రామానుజాచార్యులు భారత దేశాన్ని సమతాభావం తో అందరినీ ఒకే చత్రం క్రిందకు తీసుకొని వచ్చారుఅలాగే శ్రీ రామానుజాచార్యులు రచించిన శ్రీ భాషా ది రచనల గురించి ప్రస్తావించారు దేశీయ భాష అయిన ద్రావిడ భాష ను కూడా శ్రీ రామానుజాచార్యులు సంపన్నం చేశారు అని తెలిపారు వారికి సంస్కృత ద్రావిడ భాషలు రెండు కండ్లలా చూశారు అన్నారు. అందరికీ మోక్ష (మిగతా 12 పేజీలో)



సహస్రాబ్దికి విచ్చేసిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని మోడీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ తమిళ్‌సై సౌందర్‌రాజన్ తదితరులు




చారిత్రాత్మక ఘట్టం ఇందులో పాల్గొనుటే మహాభాగ్యం అని దేశనేతలు సైతం తరలివచ్చారు. అద్భుతసమయంలో మేము సైతం అంటూ శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి వెంట నిలిచారు





రాష్ట్ర గవర్నర్ తమిళ్‌సై సౌందర్‌రాజన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిషన్‌రెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్

# వైకుంఠాన్ని తలపించే మహోన్నత వేదిక



**చతుర్దశ భువనాలు కొలువైనట్లు వెయ్యేళ్ల పండుగ ఏర్పాట్లలో వైభవం అడుగడుగునా కనిపించింది. దివ్యసాకేతం నుంచి ప్రారంభమైతే, సమతామూర్తి ఆవరణ, యాగశాల, ప్రవచన మంటపం వీటి అనుబంధంగా మరికొన్ని ప్రదేశాలు. అన్నీ దర్శనీయ స్థలాలే. తెలియని విషయాలు, తెలుసుకోవాల్సిన రహస్యాలు తరచి చూస్తేకానీ కనిపించవు. వైదికరహస్యాలను వెల్లడించే హోమశాలలు, ఇష్టిశాలలు ఎన్నో అక్కడ మనకు కనిపిస్తాయి. ఎక్కడ ఏం జరిగింది దానివల్ల విశ్వమానవాళికి జరగనున్న మేలు ఏమిటన్న సమాధానం కనిపిస్తుంది. వైదిక రహస్యాలను లోతుగా తెలుసుకోవాలన్న జిజ్ఞాసులకు ఈ వ్యాసం చక్కని సమాచారం ఇస్తుంది. ముఖ్యంగా ప్రత్యక్షంగా సహస్రాబ్ధివేడుకలలో పాల్గొనలేని వారికి అక్షరరూపకంగా అందిచేందుకు శ్రీసన్నిధానం చేస్తున్న ప్రయత్నమిది. ఆస్వాదించండి ఆనందించండి! ఇది వైకుంఠాన్ని తలపించే మహోన్నత వేదిక. నలువైపులా ఏర్పాట్లు! ఎటు వైపు చూసినా జన సందోహమే. సాకేతరాముడు, కోదండరాముడు అశ్వారూఢుడై యాగస్థలికి తరలినప్పటి నుండి ఆనందోత్సాహం ప్రారంభమైంది. పన్నిద్దరు జీయరు స్వాములతో కలిసి శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామి అందించిన ప్రవచనామృతధార సంస్కృతి సంప్రదాయాలకు జీవనాధారం అవుతుందనడంలో అతిశయోక్తి లేదు.**

మామిడి తోరణాలు, రంగురంగుల రంగవల్లులు, అరటి స్తంభాలు, వాటికి బరువైన గెలలు, రంగు రంగుల పూ దండల తోరణాలు... ఇలా ప్రకృతి పలకరింపుతో పరవశించిన ఆధ్యాత్మికత సౌరభాలను దశదిశలా వెరిసింది.

ముందుగా ముచ్చింతల దివ్య సాకేతంలో అడుగిడిన వారికి ఆహ్లాదకరమై వాతావరణం స్వాగతం పలికింది. నృత్యాలు, జానపదుల పాటలు, ప్రవచన మంటపం నుంచి పెద్దల ప్రవచనామృత ధార, హోమశాలల నుంచి మంత్రోచ్చారణలు, అపక్కనే ఉన్న మంటపాలనుండి వేదఘోష.. అంతా శ్రావ్యంగా సందర్శకులను ఆధ్యాత్మికలోకంలోకి తీసుకు వెళ్ళింది. ఇక్కడ నిర్వహించబడిన కార్యక్రమాల వేదికలను నాలుగు ప్రదేశాలుగా విభజనం చేసి ఆ సమాచార విశేషాలను విశ్లేషించవచ్చు! ఆశ్వాదించవచ్చు!!

ఇక్కడ సందర్శకులు దర్శించాల్సినవి 1 దివ్య సాకేతం, 2 యాగశాల ఆవరణం, 3 ప్రవచన మంటపం, 4 సమతామూర్తి, దివ్యదేశాల ఆవరణం. ఇవి కాకుండా అనుబంధంగా నివాస నిర్మాణాలు, భోజనశాలలు, సమాచార కేంద్రాలు, ఇతర వసతులు, సదుపాయాలు, అన్నింటినీ సంధానం చేసే మార్గాలు (రోడ్లు) పార్కింగ్ ప్రదేశాలు.

**దివ్య సాకేతం:-** శుభారంభంగా దివ్య సాకేతం నుండి శ్రీ సీతారామచంద్ర పెరుమాళ్ మూర్తులను సపరివారంగా ప్రధాన యాగశాలకు చేర్చారు. శోభాయాత్రగా తరలించిన దేవతామూర్తులను ప్రధాన యాగశాల మంటపంలో వేంచేపు చేశారు. భక్తులు వేదా ఆగమ పండితులు ఋత్విక్‌లు, సేవకు వచ్చిన వారు అనుసరిస్తుండగా, కళాకారులు సాంప్రదాయ ప్రదర్శనలు చేస్తూ ఉండగా, ఈ శోభాయాత్ర సాగింది. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారిని పరమహంస పరివ్రాజకాచార్యులు అందరూ అనుసరించారు. దివ్యసాకేతంలో మూల పెరుమాళ్లకు నిత్యారాధనలు కొనసాగాయి.

**యాగశాల ఆవరణ:-** సువిశాల ప్రదేశంలో చతురస్ర పరిక్రమణ ఆత్మకంగా యాగశాలలు ఏర్పాటు చేశారు. యాగశాలల చుట్టూ గోశాలలు ఏర్పాటు చేశారు. మొత్తం 114 యాగశాలలు మరియు ప్రధాన యాగశాల. ప్రతి యాగశాలలో

చతురస్రం, యోని కుండం, షడస్రం, త్రికోణం, వృత్తాకారం, ధనురాకారం, అష్టాస్రం, పంచాస్రం, పద్మకుండం ఆకారాలతో వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుష, సత్య, అచ్యుత,

# వైభవాన్ని తలపించే మహోన్నత వేదిక

అనంత, ఆపసక్త్య నామాలతో 9 కుండా లను ఏర్పాటు చేశారు. శాల లో నాలుగు మూలల్లో మధ్యలో ఉన్నత ప్రదేశాలపై స్తండిల మండలాలపై పూర్ణకుంభాలు అలంకరించి భగవద్ ఆవాహన కొరకు ఏర్పాటు చేశారు. ఏక కాలంలో ప్రధాన యాగశాల తో అన్వయిస్తూ హవనారాధనలు నిర్వహించారు. ప్రతిష్ఠించ బోవు దివ్యదేశ పెరుమాళ్ నామములు, విష్ణు సహస్రనామములు, మూలమంత్ర, మూర్తి మంత్రాలతో నియమిత వేదాధ్యయనం తో పంచసూక్తములతో హవిస్సులను సమర్పిస్తూ ఆచార్యాజ్ఞానుసారంగా హవనారాధనలు నిర్వహించారు.

దీర్ఘచతురస్రాకారంలో రెండు ఇష్టి శాలలను నిర్మించారు. అందులో కర్ర చిలుకలతో అలంకరించిన తోరణాలు. దేవ మంటపం గా శుక మంటపం ఏర్పాటు చేశారు. మరొక ఇష్టి శాలలో దేవ మంటపాలు గా దర్పణ, భరణి మంటపాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ఇష్ట శాల లో రెండు హోమకుండ ఆరాధనలు నిర్వహించారు. ఉభయదారుల కోసం, కార్యక్రమ రక్షణ కోసం, వాసుదేవ, సుదర్శన, లక్ష్మీనారాయణ, విశ్వక్సేన, హయగ్రీవ, వైభవ, పరమేష్టి, వైనతేయఇష్టిలను నిర్వహించారు. మరొక దీర్ఘచతురస్ర శాలలో దివ్య దేశ ప్రతిష్ట దేవతామూర్తులకు జలాది ఆవాసాలతో ఆవాస మంటపాన్ని ఏర్పాటు చేశారు. మరొక శాలలో అంకురార్పణం గావించిన పాలికలు ప్రతిష్టించిన పాలికా మండపం ఏర్పాటు చేశారు. యాగ శాలకు మధ్యస్థంగా 15 పారాయణ మండపాలు ఏర్పాటు చేశారు. వీటిలో 12 వేద శాఖలను, నాలాయిర దివ్య ప్రబంధాలను,శ్రీ రామానుజ శ్రీ సూక్తులు అయిన శ్రీ భాష్యాది గ్రంథాలను, రామాయణ భాగవతాదుల పారాయణలు నిర్వహించారు. నిత్యం భగవత్ సన్నిధి లో ఉదయం సాయంత్రం ఆరాధనలో ప్రారంభ ముగింపు అవధారణలు నిర్వహించారు. ప్రతి యాగశాలకు నాలుగు మార్గాలు ఏర్పాటు చేశారు. ప్రధాన యాగశాలకు అభి ముఖాదిగా నాలుగు తిరుమార్గాలను, వీధులను ఏర్పాటు చేశారు. శ్రీ భగవద్ రామానుజాచార్య చరిత్ర వైభవం స్ఫురించే లాగా ప్రధాన యాగశాలకు ఈశాన్యాది నాలుగు మూలల్లో నాలుగు మంట పాలతో యాగశాలల కూడలి లను ఏర్పాటు చేశారు అవి పుష్ప మండపం, జ్ఞాన మంటపం, భోగ మంటపం, త్యాగం మంటపం. ఈశాన్యం వైపున కొన్ని శాలలను



ఇతర కార్యాలకు కేటాయించారు.

**పుష్ప మంటపంలో:** 24 యాగశాలలు, 216 హోమ కుండాలు. 3 పారాయణ మండపాలు.

**త్యాగ మంటపంలో:** 32 యాగశాలలు, 288 హోమ కుండాలు.4 పారాయణ మండపాలు.

**జ్ఞాన మంటపంలో:** 29 యాగశాలలు, 261 హోమ కుండాలు,4 పారాయణ మంటపాలు.

**భోగ మంటపంలో:** 29 యాగశాలలు, 261 హోమ కుండాలు 4 పారాయణ మండపాలు.

**ప్రధాన యాగశాల:** ఒక యాగశాల, 9 హోమ కుండాలు మొత్తం1035 హోమ కుండాలు114 మరియు ప్రధాన యాగశాల తో కలిపి115 యాగశాలలు ఏర్పాటు చేశారు ప్రధాన యాగశాలకు నాలుగు వైపులా గజ మూర్తులను ఏర్పాటు చేసి నిత్యనూతన అలంకరణలతో తీర్చిదిద్దారు.

**ప్రవచన మంటపం:-** నిత్యం ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీ రామానుజ, లక్ష్మీనారాయణ, హయగ్రీవ, సీతారామచంద్రాది దేవతల అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించబడ్డాయి. ప్రముఖుల, పాలకుల, సాధు సంతుల, ఆచార్యుల ప్రసంగాలు ప్రవచనాలు ఇక్కడ కొనసాగాయి. చిన్నారుల భగవద్గీత అవధానం నాట్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించబడ్డాయి. ఇక్కడ జరిగిన సమాపనోత్సవంగా **(మిగతా 10 పేజీలో)**



**వికాసతరంగిణి కార్యకర్తలతో సహస్రాబ్దిలో పాల్గొనడానికి అమెరికా నుంచి విచ్చేసిన శ్రీమాన్ సీతారామస్వామి వారు**

# భూతశుద్ధితోనే మంత్రన్యాసం

శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామి
ప్రవచనామృతం



"పూర్ణ మిదం పూర్ణమదః పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే'' అను వేదవాక్కు చెప్పినట్లు శ్రీ భగవద్ రామానుజాచార్యులు దయాపూర్ణులు. భగవత్ స్వరూపులైన శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారు సంకల్ప పూర్ణులు. అందుకే శ్రీ రామానుజ సహస్రాబ్ది సమారోహ కార్యక్రమం ఆమూలాగ్రం శుభంకరం పరిపూర్ణం అయింది. "అలతిం బోడు త్రివిక్రమస్ఫురణ వాడై నిండు బ్రహ్మాండమున్'' అని త్రిపాదావిష్టితంగా మూడు ప్రదేశాల్లోనూ శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారు స్వయంగా కార్యక్రమాలను నిర్వహింప చేశారు. యాగశాలావరణంలో శ్రీమదష్టాక్షరీ మంత్ర ధ్యాన జపాలు నిర్వహించారు. నిత్యపూర్ణాహుతులను నిర్వహించారు. శ్రీ రామానుజ వైభవాన్ని అనేక సూచనలను అనుగ్రహించారు. సమతామూర్తి ఆవరణలో ప్రముఖులు విచ్చేసినప్పుడు దగ్గరుండి స్వయంగా వివరిస్తూ దర్శనం గావింప చేశారు. స్వయంగా **108** దివ్య దేశ పెరుమాళ్ళ ను ప్రతిష్ఠింప చేశారు. ప్రవచన మంటపంలో దివ్య ప్రవచనాలతో పాటు అష్టోత్తర పూజలు నిర్వహింప జేశారు. "అతిబల, మహాబల'' విద్యా సిద్ధి గల సాధు రక్షకుడైన దివ్య సాకేత రామచంద్రుని అనుగ్రహంతో, భక్తజనుల కైంకర్య పుష్టి తో శ్రీ చిన్న జీయర్ స్వామివారి లో అలసటే కనిపించలేదు. శ్రీ స్వామి వారి దయా వృష్టి కురిసిన ఈ క్షేత్రం ఆచార్యుల ఉదారతకు ఉదాహరణం. వివిధ సందర్భాల్లో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి ప్రవచన సారాన్ని మరొకసారి తెలుసుకుందాం. కార్యక్రమ స్థలాల్లో వివిధ సమయాల్లో శ్రీ చిన్న జీయర్ స్వామివారు సందర్భానుగుణంగా అనేక సూచనలు చేశారు. **1035** కుండాల యాగ ప్రాధాన్యాన్ని తెలియజేశారు. చతుస్థానాల్లో భగవదారాధన విధానాన్ని తెలియజేశారు. యజ్ఞ భగవానుని విశేష కృప వల్ల కలిగే ఫలాలను వివరించారు. వేదాల్లో పురాణాల్లో ఇష్టికి గల ప్రాముఖ్యత వివరించారు. భగవద్ రామానుజ చార్యుల సమతా స్ఫూర్తిని గురించి తెలియజేశారు ప్రధానంగా యాగశాలల వ్యూహా రచనల్లో శ్రీ భగవద్ రామానుజాచార్యుల జీవితాన్ని ప్రభావితం చేసిన నాలుగు దివ్యదేశాల వైభవం గుర్తించేలాగా నాలుగు యాగశాలల మంటపాలను ఏర్పాటు చేసిన విధాన్ని వివరించారు. త్యాగమంటపం శ్రీకంచి, భోగ మంటపం శ్రీరంగం, పుష్ప మండపం తిరుమల, జ్ఞాన మంటపం తిరునారాయణ పురం ఈ నాలుగు దివ్య క్షేత్రాల తో ముడిపడిన శ్రీ రామానుజాచార్యుల చరిత్ర వైభవాన్ని వివరించారు. నిత్యం ప్రధాన యాగశాల వద్ద శ్రీమదష్టాక్షరీ మంత్ర ధ్యాన జపాలు చేయించారు. ఋత్విక్కులు మరియు అనేక మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశేషమైన ఈ కార్యక్రమంలో ఎన్నో విలువైన రహస్యాలను శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు అనుగ్రహించారు.



భూతశుద్ధి గురించి అమూల్య విషయాలను తెలియజేశారు. మంత్ర జప ఉపక్రమణకు ముందుగా సిద్ధం ఎలా కావాలో శ్రీస్వామి వారు వివరించారు. గురుపరంపరానుష్ఠానం ఏ విధంగా చేయాలో తెలిపారు. అలాగే ఉత్కృష్టమైన అష్టాక్షరీ మంత్ర జపం చేయడానికి భూతశుద్ధి అవసరమని వివరించారు. భూత శుద్ధి తర్వాతనే మంత్రాక్షర న్యాసం చేయవచ్చునన్నారు. న్యాసం జరిగినప్పడే **(మిగతా 10 పేజీలో)**



## చిన్న జీయర్ స్వామి ప్రవచనా మృతం

**(9వ పేజీ తరువాయి)** ఆ అక్షరాల ప్రభావం ఫలితం పొందగలమని వివరించారు. అంటే మనలోని అనేక ప్రాకృతిక వాసనలు తొలగించుకొని హృదయాన్ని శుద్ధి చేసుకునే విధానాన్ని వివరించారు. పంచభూతాలతో తయారయిన ఈ శరీరాన్ని శుద్ధి చేసే విధానాన్ని భూతశుద్ధి అంటారు. శరీరం లోపలి భాగాల్లో ఇంద్రియాలు ఉన్నాయి. మనసు ఉంది జ్ఞానాన్ని ప్రభావితం చేసే బుద్ధి ఉంది. వీటన్నిటిని శుద్ధిచేసిన అప్పుడే దాన్ని భూతశుద్ధి అంటారు. దీనికి కొన్ని దశలు లేక లెవెల్స్ ఆగమ గ్రంథాల్లో చెప్పబడ్డాయి. ఆ వాసన బీజాలు మనం చేసే పనుల వల్ల అంటినవి. అవి కాగితం పైన రాసిన రాతలా చెరిగిపోకుండా ఉంటాయి. ఆ వాసనలను జ్ఞానాగ్నితో కాల్చాలి. అంటే ఆలోచనలతో శుద్ధి చేయాలి అన్నారు. అది ఎలా చేయాలంటే మొదట స్వీయ అనుష్ఠానం శ్రీపాద తీర్థంతో భౌతిక శుద్ధి చేసుకోవాలి. సుఖాసనంలో కూర్చొని ధ్యానం ప్రారంభించాలి. ఆ ధ్యానంలో నాభిలో ప్రారంభమైన అగ్ని గాలితో కలిసి గుండెల వరకు దహిస్తున్నట్లు భావించుకోవాలి. తలపై నుండి భగవదనుగ్రహం అనే వర్షం కురిసినట్లు భావించుకోవాలి. ఆవిధంగా ఇంద్రియ వాసనలు తొలగించుకోవాలి. అనంతరం గురుపరంపర భగవంతుని దివ్య మంగళ విగ్రహ ధ్యానం చేసుకుంటూ మంత్ర జపాన్ని ఆచరించాలి అని తెలిపారు.

ప్రతిరోజు శ్రీమదష్టాక్షరీ మంత్ర జప ధ్యానాల నిర్వహణ సమయంలో ఎన్నో అమూల్య విషయాలను శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి కృప చేశారు. శ్రీ స్వామి వారి ప్రవచన అమృతం ఆస్వాదించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు.వారు చేసే బోధనల్లోగల క్రమశిక్షణ, ఆరాధనా నిరతి, ఆచార్య భక్తి, భగవత్ సంబంధ విషయాలు అందరినీ భగవదభిముఖులను గావించాయి

## వైకుంఠాన్ని తలపించే వేదిక

**( 8వ పేజీ తరువాయి)** ఋత్విక్కుల, వేదపండితుల సన్మాన ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సమతామూర్తి ఆవరణం దివ్య దేశ దేవాలయాలు:- మహోన్నతమైన దేదీప్యమానమైన సమతామూర్తి సమారోహ ప్రదేశం అద్భుతమైనది. ఎత్తయిన కట్టడాలతో సోపానాలతో సంస్కృతికి ప్రతిబింబంగా నిర్మించబడింది. విశాలమైన ఆవరణ వేల మంది సందర్శకులకు ఆనందాన్ని కలిగించింది. ప్రొజెక్టర్ ల ద్వారా లేజర్ షో గా శ్రీ రామానుజ దివ్యచరిత్ర ప్రదర్శించబడింది. ప్రముఖులతో అనేక అంశాలు ఇక్కడ ప్రారంభించి ఆవిష్కరించబడ్డాయి. 108 దివ్యదేశాల దేవాలయాల్లో మూల మూర్తులు ముందుగానే స్థాపించబడ్డాయి ఆయా నిర్ణీత హోమ కుండాల నుండి సంపాదిత ఆజ్యము, ఆవాహిత పూర్ణకుంభ జలాలతోను ఆయా అర్చామూర్తులను శాస్త్రోక్తంగా తీసుకుని వచ్చి ప్రోక్షణాలతో ప్రతిష్ఠించారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి కరకమల ములచేత మహా పూర్ణాహుతి వరకు సమస్త అర్చా మూర్తులకు ప్రతిష్ఠలు జరిగాయి. విశేషించి విరాణ్ మూర్తిని ప్రధానమంత్రి చేత, స్వర్ణ మూర్తిని రాష్ట్రపతి చేత ఆవిష్కరింపజేశారు.మహా పూర్ణాహుతి తో హవనారాధనలు ముగిసి, పరిపూర్ణ పవిత్ర జలంతో శ్రీ రామానుజ సువర్ణ మూర్తికి జరిపిన కుంభ ప్రోక్షణ తో ప్రతిష్టా మహోత్సవాలు ముగిసాయి.

వసతులు:- అన్ని ప్రదేశాల్లోనూ అనేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. సమాచార శాలలు, వైద్య సదుపాయం, శౌచాలయాలు. నీటి వసతి, పుస్తక విక్రయశాల ఏర్పాటు చేశారు. పటిష్టమైన రక్షణ వలయం, సమాచార విస్తరణకు మీడియా వ్యవస్థ, రిత్విక్ నివాస శాలలు, భోజనశాలలు ఏర్పాటు చేశారు.

వేనోళ్ళ పొగిడే వేయి సంవత్సరాల పండుగగా శ్రీ రామానుజ సహస్రాబ్ది సమారోహం వేడుకలు లోకోత్తరంగా నిర్వహించబడ్డాయి. అన్నింటికీ శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి సంకల్పం, పర్యవేక్షణ, కటాక్షం మూడింటితో సాఫల్యత పొందింది. భగవదనుగ్రహం భక్తుల సేవాభావం కూడా తోడై కార్యక్రమం కన్నుల పండుగగా విజయవంతంగా ముగిసింది.



**సువర్ణమూర్తి వద్దకు పూర్ణ కలశంతో తరలి వెళుతున్న 82 యాగశాల ఋత్విక్ బృందం**




























తిరుమల జీయరు స్వామి టిటిడి చైర్మన్, ఏపి ముఖ్యమంత్రితో పాటు రాజకీయనాయకులు, తెలంగాణా ప్రాంత రాజకీయనాయకులు, వ్యాపార వాణిజ్యవేత్తలు, పలు ప్రభుత్వ శాఖల ఉన్నత ఉద్యోగులు ఆహ్వానాలు అందుకుని వచ్చినవారిలో ఉన్నారు. అంతేకాకుండా భారత దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు, సాధువులు కూడా సమతామూర్తి ఆవిష్కరణోత్సవానికి వచ్చిన వారిలో ఉన్నారు. వారందరితో ప్రవచన మంటపంలో స్వామి వారు గోష్ఠి నిర్వహించడం ప్రతేక అకర్షణ. సినీ ప్రముఖులు వారి అభిమానులు 12 రోజులు ప్రతిరోజూ వస్తూనే ఉన్నారు. వచ్చిన వారినందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి తగు సత్కారాలు చేస్తూ వచ్చారు. ప్రముఖుల ప్రొటోకాల్స్ పేరుతో వస్తున్న సందర్శకులను ఇబ్బంది పెట్టకండి వారికి అవకాశం ఇవ్వండి ప్రేమతో ఆహ్వానించండి అంటూ పదే పదే జీయరు స్వాములు పదేపదే విజ్ఞప్తి చేయడం ప్రత్యేకత ఆకర్షణ







## మంగళాశాసనాలు

శ్రీ సన్నిధానం పత్రికకు ఈమాసం కైంకర్యంలో భాగస్వాములయిన శ్రీతులసి వంశీకృష్ణ, శ్రీమతి దీపిక, పిల్లలు అక్షర,ఆరాధ్య (uk). వీరికి శ్రీలక్ష్మీనారాయణుల అనుగ్రహం కలిగి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని మంగళాశాసనములు

సహస్రాబ్ది ఉత్సవాల విశేషాలు ఎన్నో ఎన్నెన్నో కంటికి కనిపించేవి కొన్ని, వైదిక రహస్య సారాలు మరికొన్ని వాటి విశేషాలు ధారావాహికంగా ప్రతి సంచికలో పాఠకులకు శ్రీసన్నిధానం వరుసగా అందిస్తుంది.

-ఎడిటర్

## సనాతనన ధర్మానికి పూర్వ వైభవం

**(5వ పేజీ తరువాయి)** అధికారం ఉంటుందని శ్రీ రామానుజాచార్యులు తెలిపారు అనేక చోట్ల నేను గమనించాను దేశంలో అనేక సాంప్రదాయాల్లో శ్రీ రామానుజాచార్య మూల తత్వమే కనిపిస్తుంది అన్నారు మహారాష్ట్రలోని వర్కరీ సంప్రదాయం, రాజస్థాన్ మరియు గుజరాత్ లోని వల్లభ సంప్రదాయం, అస్సాంలోని శంకర్ దేవ్ మాధవ్ దేవ్ సంప్రదాయం మధ్యప్రదేశ్ మణిపూర్ బెంగాల్లోని చైతన్య సంప్రదాయం మొదలగు సంప్రదాయాల్లో ఉపదేశ మూలాల్లో శ్రీ రామానుజ విశిష్ట అద్వైత సంప్రదాయం కనిపిస్తుంది అని విశ్లేషించారు ఈ సంప్రదాయంలోని మూలమంత్రం సమానత్వమే అని ప్రశంసించారు. అదే భక్తి సంప్రదాయం అని శ్లాఘించారు. గుజరాత్ లోని చిన్న పల్లెటూర్లో లైబ్రరీలో శ్రీ రామానుజాచార్యులు రచించిన నవ గ్రంథాలను తాను చూశానని తెలిపారు. శ్రీ రామానుజాచార్యులు ఎంతోమందిని దిద్దుబాటు చేశారని వివరించారు. శ్రీ రామానుజాచార్యులు ఎంతో మందికి ప్రేరణ ఇచ్చారు అని తెలిపారు. ఆ ప్రేరణ యుగయుగాల కీ శాశ్వతం అవుతుంది అన్నారు. ఈ శుభ కాలంలో అన్ని రకాలుగా సనాతన ధర్మం నిలబడుతూ ఉన్నది అని సంతృప్తిని వ్యక్తం చేశారు.అయోధ్య రామాలయం నిర్మాణం గురించి ప్రస్తావించారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారిని ప్రశంసిస్తూ నమస్కారాలు తెలియజేశారు. శ్రీమాన్ అమిత్ షాగారి ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నది. ★

## "వేనోళ్ల స్తుతించే వెయ్యేళ్ళ పండుగ"

**(4వ పేజీ తరువాయి)** శ్రీ రామాయణాన్ని అధ్యయనం చేశారు తిరుమలకు వేంచేసిన శ్రీరామానుజాచార్యులు శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్‌లను శ్రీనివాస స్వరూపంగా నిరూపించి ఆరాధన సాంప్రదాయాలను ఏర్పాటు చేశారు. తిరుమల వైభవాన్ని సుసంపన్నం చేశారు. శ్రీనివాస పెరుమాళ్లకు శంఖచక్రాలను ధరింపజేసి ఆచార్య స్థానంలో నిలిచారు. అక్కడ భగవదారాధనకు పుష్ప కైంకర్యానికి అనంతాళ్వార్లు అను శిష్యులను ఏర్పాటు చేశారు. ఆ విధంగా తిరుమల పుష్ప మండపంగా స్తుతించబడింది.

పరిస్థితులకు అనుగుణంగా శ్రీ రామానుజాచార్యులు సుదీర్ఘ కాలం తిరునారాయణపురంలో నివాసం చేశారు. అక్కడి క్షేత్ర పెరుమాళ్ల వైభవాన్ని పునః స్థాపించారు. శ్రీభాష్య, గీతాభాష్యాది నవరత్నాల అనబడు సిద్ధాంత వాఙ్మయాన్ని అనుగ్రహించారు. ఢిల్లీ సుల్తానుల వద్దనుండి సంపత్కుమార పెరుమాళ్లను తిరునారాయణపురానికి తీసుకొని వచ్చారు. ఎంతో మంది శిష్యులకు సిద్ధాంత జ్ఞాన బోధనలు గావించారు ఆ విధంగా తిరునారాయణపురం జ్ఞానమంటపంగా స్తుతించబడింది.

అందుకే శ్రీ రామానుజ సహస్రాబ్ది సమారోహ హవన కార్యక్రమంలో ఈ నాలుగు మంటపాలను ఏర్పాటు చేశారు. "శ్రీరామానుజ" అన్న దివ్యనామ సంబంధముగలది ఏదైనా మనకు రక్షక మైనదే! వారి చరిత్ర వైభవమైనా, తిరుమూర్తి దర్శనమైనా, ఉపదేశ శ్రీసూక్తులయినా, ఆదర్శమైన ఆచరణ అయినా " శ్రీ రామానుజ సుధా మాధురి" మృతసంజీవిని అయి ఆనందాన్ని, మాధుర్యాన్ని ప్రసాదిస్తుంది. ★

Marketing Editor Samudrala Raghuramacharya